ఆంధ్రజ్యోతి



పంట సాయం అందేదెన్నడో..?

- వరి పంట పొట్ట దశకొచ్చినా అందని రైతు బంధు
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పని పరిస్థితి
- రెండు నెలల్లో మూడు ఎకరాల్లోపు రైతులకు డబ్బులు
- జిల్లాలో 2,39,818 మంది అర్హులు
- ఇప్పటివరకు 1,81,450 మందికి మాత్రమే సాయం

జగిత్యాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో సకాలంలో పంట సాయం అందకపోవడంతో అన్నదాతలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. చాలా మంది రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు జమకాలేదు. ఇప్పటివరకు మూడెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందింది. త్వరగా నిధులు మంజూరు చేయాలని మిగిలిన రైతులు కోరుతున్నారు. జిల్లాలో సుమారు రెండు లక్షలకు పైగా రైతులున్నారు. ప్రతీ సంవత్సరం రెండు సీజన్‌లలో వీరికి రైతుబంధు సాయం అందుతోంది. ఒక సీజన్‌లో రైతుబంధు పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందించడానికి జిల్లాకు సుమారు రూ. 214 కోట్ల నిధులు అవసరం అవుతాయి. యాసంగి సీజన్‌కు సంబంధించి 2023 డిసెంబరు 10న రైతు బంధు నిధుల జమ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 17వ తేదీ వరకు జిల్లాలోని కొద్ది మంది రైతుల ఖాతాల్లో సాయం డబ్బులు జమ అయ్యాయి. మిగిలిన రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఇంకా అందని రైతులు 58,358 మంది ...

జిల్లా వ్యాప్తంగా 2,39,818 మంది రైతులు రైతు బంధు పథకానికి అర్హులుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. యాసంగి సీజన్‌కు గానూ సంబంధిత రైతులకు రూ. 214.32 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇందులో ఈనెల 17వ తేదీ వరకు 1,81,460 మంది రైతులకు రూ. 100.86 కోట్ల పెట్టుబడి సాయాన్ని ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఇంకా 58,358 మంది రైతులకు పెట్టుబడి సాయం అందించాల్సి ఉంది. ఇందుకు సుమారు రూ. 113.46 కోట్లు నిధులు అవసరమవుతాయని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

అందరికీ అందేనా...

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక రైతుబంధు పథకంలో మార్పులు తీసుకొని రావాలని యోచించినట్లు ప్రచారం జరిగింది. కానీ అప్పటికే యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో ఈసారికి పాత పద్ధతిలోనే రైతులకు పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించింది. 2023 డిసెంబరు 10వ తేదీన రైతుల ఖాతాల్లో డబ్బుల జమ ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటివరకు మూడెకరాల లోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందిందని సంబంధిత వర్గాలు అంటున్నాయి. దీంతో మిగితా రైతుల్లో ఆందోళన నెలకొంది. అందరికీ రైతు బంధు పథకం వర్తింప జేస్తారా లేక ఐదెకరాలలోపు వారికే ఇస్తారా అన్న విషయమై స్పష్టత రావడం లేదని ఆందోళనకు గురవుతున్నారు. కాగా రైతు బంధు పథకానికి అర్హులైన రైతుల వివరాలను ఇప్పటికే ట్రెజరీకి పంపించామని, ప్రభుత్వం నిధుల విడుదల చేయగానే రైతుల ఖాతాల్లో జమ అవుతాయని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటివరకు మూడెకరాలలోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే సాయం అందిందని, మిగిలిన రైతులకు నిధులు విడుదల కాగానే రైతుల ఖాతాలలో జమ అవుతాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

3,01,249 ఎకరాల్లో పంటల సాగు..

జిల్లాలో యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు రైతులు సుమారు 3,01,249 ఎకరాలల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. జిల్లా సాధారణ సాగు 3,40,000 ఎకరాలు కాగా ఇప్పటివరకు సుమారు 90 శాతం మేర పంటలు సాగు అవుతున్నాయి. ఇందులో ప్రధానంగా వరి, మొక్కజొన్న, జొన్న, నువ్వు పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో వరి 2,69,817 ఎకరాల్లో సాగు చేస్తుండగా మొక్కజొన్న 27,014 ఎకరాలు, జొన్న 1,056 ఎకరాలు, అనుములు 20 ఎకరాలు, శనగలు 135 ఎకరాలు, పెసర 90 ఎకరాలు, పల్లి 554 ఎకరాలు, ఆవాలు 236 నువ్వులు 1,706 ఎకరాలు, చెరుకు 338 ఎకరాలు, ఇతర వివిధ పంటలు 283 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

తప్పని పెట్టుబడి తిప్పలు..

యాసంగి సీజన్ ప్రారంభమై మూడు నెలలవుతోంది. జిల్లాలో వరి మినహా యాసంగి పంటల సాగు దాదాపు దగ్గర పడింది. డిసెంబరులోనే జమ కావాల్సిన రైతుబంధు నిధులు ఇప్పటికీ పూర్తి స్థాయిలో జమ కాలేదు. సకాలంలో సాయం అందకపోవడంతో చాలా మంది రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. పంట పెట్టుబడుల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సి పరిస్థితి చోటుచేసుకుందని వాపోతున్నారు. రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పెట్టుబడికి తిప్పలవుతోంది..

అబ్దుల్ ఖదీర్, రైతు, పోరుమల్ల, మేడిపల్లి మండలం



ప్రభుత్వం రైతుబంధు డబ్బులు ఎప్పుడు వేస్తదా అని ఎదురుచూస్తున్నాము. యాసంగి పంటల పెట్టుబడులకు తిప్పలు అవుతోంది. ఇప్పటికే సగం వరకు పంట కాలం అయిపోయింది. గతంలో రైతులకు పెట్టుబడి సాయం సమాయానికి అందు తుండేది. ప్రస్తుత సీజన్‌లో కేవలం మూడు ఎకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే ఇప్పటివరకు రైతు బంధు డబ్బులు జమ చేశారు.

అర్హులైన రైతులందరికీ సాయం అందించాలి

కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు



జిల్లాలో అర్హులైన రైతులందరికీ రైతు బంధు పథకం కింద పెట్టుబడి సాయం అందించాలి. యాసంగి సీజన్‌లో సకాలంలో రైతుల ఖాతాల్లో రైతు బంధు పథకం డబ్బులు జమ కాకపోవడంతో అన్నదాతలు తల్లడిల్లుతున్నారు. కేసీఆర్ సర్కారు హయాంలో రైతులకు సకాలంలో రైతు బంధు డబ్బులు అందించాము. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం డబ్బులు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడం బాధాకరము.



అంజన్న సన్నిధిలో రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, మేడిపల్లి సత్యం (ఫైల్)

కొండంత ఆశలు

- కొత్త ప్రభుత్వంపై అంజన్న భక్తుల ఎదురుచూపులు
- కొండగట్టు అభివృద్ధి, పర్యాటకమే ప్రాధాన్యం
- ఇరవై ఏళ్లుగా ప్రతిపాదనలకే మాస్టర్‌ప్లాన్
- యాదాద్రి తరహాలో అభివృద్ధికి భక్తుల ఆశాభావం

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై కొండగట్టు అభివృద్ధి ఆశలు పెరిగాయి. ఏడాది క్రితం అప్పటి సీఎం కేసీఆర్ కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధికి వంద కోట్ల రూపాయలు మంజూరు చేస్తామని ప్రకటన చేయగా, ఫిబ్రవరిలో అంజన్న క్షేత్రాన్ని సందర్శించారు. కొండగట్టు అభివృద్ధికి మరో 500 కోట్లు ఖర్చు చేస్తామని యాదాద్రి తరహాలో తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. మాస్టర్‌ప్లాన్ రూపకల్పన చేపట్టారు. అయితే ప్రభుత్వం మారడంతో అది అటకెక్కింది. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శాసనసభలో కొండగట్టు అభివృద్ధి ప్రస్తావించడంతో ఇక్కడి అభివృద్ధిపై భక్తులు ఆశలు రెట్టింపయ్యాయి. కొండగట్టుకు గత ప్రభుత్వం 100కోట్లు ప్రకటించిందని వాటిని మంజూరు చేయలేదని ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని సభలో కోరారు.

- మల్యాల

6

ప్రజావాణి అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 19: ప్రజావాణి ఆర్జీలను తక్షణమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షేక్ యాస్మీన్ బాషా ఆదేశాలు జారీ చేశారు. సమీకృత కలెక్టరేట్ సముదాయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 16 మంది తమ సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, కోరుట్ల, మెట్‌పెల్లి ఆర్డీవోలు రాజేశ్వర్, శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస రావు, డీఆర్‌డీవో సంపత్ రావు, జడ్పీ సీఈవో గౌతం రెడ్డి తదితరులు ఉన్నారు.

● జిల్లాలోని మెట్‌పల్లి మున్సిపల్ 12వ వార్డులో పలు అభివృద్ధి పనులకు రూ. 50 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరుతూ వార్డు కౌన్సిలర్ ఫర్జానాబేగం-షాకీర్ సిద్ధిఖీ కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాకు వినతిపత్రం సమర్పించారు. వార్డులో వివిధ ప్రాంతాల్లో సీసీ రహదారుల నిర్మాణానికి రూ. 30 లక్షలు, మురికి కాలువల నిర్మాణానికి రూ. 20 లక్షలు కేటాయించాలని కోరారు. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి విన్నవించగా సానుకూలంగా స్పందించారన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరుతూ విజ్ఞాపన పత్రం అందజేశారు.

టెండర్ల ద్వారా రూ. 3.24 లక్షలు ఆదాయం

పెగడపల్లి, ఫిబ్రవరి 19: మండల కేంద్రంలోని స్వయంభూ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివ రాత్రి జాతర బ్రహ్మోత్సవాల వేళ దుకాణాల ఏర్పాటుకు గాను వేలం పాటల ద్వారా రూ. 3 లక్షల 24 వేల 464 ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ భూమాడి గంగారెడ్డి తెలిపారు. మార్చి 8న మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆరో తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో టెంకాయ, లడ్డు, పులిహోర విక్రయాలకు గాను దుకాణాల ఏర్పాటుకు సోమవారం వేలం పాటలు నిర్వహించారు. టెంకాయలు, బెల్లం విక్రయాల దుకాణానికి గాను రూ 1,66,116లు, లడ్డు, పులిహోర విక్రయాల దుకాణానికి రూ. 1,14,116లు, కంకణాల ధరింపజేయడానికి రూ. 32,116లు, కొబ్బరి ముక్కలకు రూ 12,116లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు తాజా మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, ఎంపీటీసీ బొమ్మెన జమునస్వామి, శివదీక్షాపరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

పెగడపల్లి, ఫిబ్రవరి 19: మండలంలోని లింగాపూర్ గ్రామంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 20 నుంచి 23 వరకు నాలుగు రోజుల పాటు జరుగనున్న స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 20న స్వామి వారి తిరుక్కళ్యాణ మహోత్సవం, 21న నిత్య హోమం, 22న కుంకుమార్చన, 23న పంచామృతాభిషేకములు, అన్నదాన కార్యక్రమంలు, ఎడ్ల బండ్ల పోటీలు, 24న స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొడిమ్యాల, ఫిబ్రవరి 19: మండలంలోని నాచుపల్లి శివారులోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్సై ఎస్ సందీప్ తెలిపిన వివరాల మేరకు గుర్తు తెలియని మగ వ్యక్తి వయస్సు సుమారు 60 నుండి 65 సంవత్సరాలు ఉండవచ్చునన్నారు. శరీరం కుళ్లిపోయి గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఉందన్నారు. తెలుపు రంగు షర్ట్, దోతి ధరించి ఉన్నాడన్నారు. గ్రామస్థుడు అంబటి తిర్మలేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- పల్లకిలో ఊరేగిన స్వామి వారు

బీర్‌పూర్, ఫిబ్రవరి 19: బీర్‌పూర్ లక్ష్మీనరసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు స్వామి వారి పల్లకి సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి పల్లకిపై ఆశీనులగావించి గ్రామంలో భక్తుల దర్శనార్థం పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేస్, కేడీసీసీ బ్యాంక్ జిల్లా మెంబరు ముప్పాల రాంచందర్ రావు, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు స్వామాట్, అర్చకులు సంతోష్, మధు కుమార్, సంతోష్, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు తదతరులు పాల్గొన్నారు.

డి-52 కెనాల్‌కు నిరంతరం నీటి సరఫరా చేయాలి

రాయికల్, ఫిబ్రవరి 19: చెరువుకు లింక్ ఉన్న డి-52 కెనాల్‌కు 21 రోజుల పాటు నిరంతరం నీటి సరఫరా చేయాలని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డికి రైతులు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్సీ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నీటి సరఫరా జరిగే విధంగా చేస్తానని తెలిపారు. కింది పంటలకు పూర్తిస్థాయిలో నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

● **మృతుడి కుటుంబానికి పరామర్శ**

మండలంలోని ఇటిక్యాల గ్రామ యూత్ కాంగ్రెస్ నాయకుడు లక్ష్మణ్ తండ్రి గుండెపోటుతో మరణించగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

‘పది’ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ షేక్ యాస్మీన్ బాషా

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 19: జిల్లాలో మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్న పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షేక్ యాస్మీన్ బాషా అధికారులను సూచించారు. పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వాహణపై కలెక్టర్ సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 67 కేంద్రాల్లో 11,365 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వివరించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. 435 పాఠశాలల్లో 5,602 బాలురు, 5,763 మంది బాలికలు పరీక్షలు రాయనున్నానన్నారు. నిర్వహణకు 67 మంది చొప్పున చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఆరుగురు అదనపు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, నలుగురు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, 22 మంది వాహన ఇన్‌చార్జిలు, కస్టోడియన్లు, 702 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. 67 కేంద్రాల్లో 144సెక్షన్ విధించ డంతో పాటు జిరాక్స్ సెంటర్లును మూసి వేయాలన్నారు. అవసరమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. ప్రతీపరీక్ష కేంద్రంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసేలా వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షల నిర్వాహణ సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా సంబంధిత శాఖ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం సమయానికి బస్సులు నడపాలన్నారు. జవాబుపత్రాలను పార్శిల్ చేయడానికి పోస్టల్ అధికారులు సహకరించాలన్నారు. విద్యార్థులు పరీక్ష సందర్భంలో ఎలాంటి భయాందోళనలకు, ఒత్తిడులకు లోనవకుండా పాఠశాలల యాజమాన్యాలు, అధికారులు వారి పర్యటన సందర్భంలో వివరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దివాకర, డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

● **పల్స్ పోలియోపై విస్తృత ప్రచారం నిర్వహించాలి..**

జిల్లాలో మార్చి 3 నుంచి 5 వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ షేక్ యాష్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. పుట్టిన పాప నుంచి మొదటుకుని ఐదేళ్ల చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కల మందు వేసేలా అందరూ పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. మార్చి 3న బూత్ స్థాయిలో, 4, 5 తేదీల్లో ఇంటింటికి తిరుగుతూ చిన్నారులకు చుక్కల మందు వేసేలా అన్ని చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 0-5 సంవత్సరాల వయసు ఉన్న వారు 91,234 మంది ఉన్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 432 బూత్‌లు, 17 మొబైల్ టీంలు, పట్టణ ప్రాంతాల్లో 75 బూత్‌లు, ఐదు మొబైల్ టీంలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమ నిర్వాహణ కోసం 2,028 మంది బూత్ స్థాయి టీమ్‌లును ఏర్పాటు చేశామన్నారు.

210 హైరిస్క్ ప్రాంతాల్లో 1,906 మంది చిన్నారులను గుర్తించామన్నారు. 3వ తేదీన జరగ నున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నిర్వహించాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా రెండు రోజుల ముందు నుంచే అవగాహన ర్యాలీలు చేపట్టాలని సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మెడికల్ అసోసియేషన్, లయన్స్ రోటరీ క్లబ్ స్వచ్ఛంద సంస్థల సహకారం అందించాలని కోరారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ దివాకర, జిల్లా వైద్యాధికారి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

భూసేకరణను నిలిపివేయాలని రైతుల ఆందోళన

- తిప్పన్నపేట, జగిత్యాలలో ధర్నా

జగిత్యాల, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి, హన్మాజీపేట, చర్లపల్లి, తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట, చల్‌గల్ శివారు నుంచి వ్యవసాయ పంట పొలాల మీదుగా నిజామాబాద్, ఆర్మూర్-మంచిర్యాల మధ్య చేపట్టే (ఎన్‌హెచ్-63) జాతీయరహదారి పనులను రద్దుచేసి, భూసేకరణ పనులను నిలిపివేయాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం భారీగా తరలివచ్చి రైతులు జగిత్యాల తహసీల్ చౌరస్తాతో పాటుగా, జగిత్యాల మండలం తిప్పన్నపేటలో ధర్నా చేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణం చేపట్టడం వల్ల తమ గ్రామాల్లోని రైతులు ఎకరం, రెండెకరాల్లోపు వ్యవసాయభూములు కలిగిఉన్న చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న తాము వీధిపాలవుతామని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం చేసే భూసేకరణలో దశాబ్దాల తరబడి రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. నూతన జాతీయ రహదారి ఎన్‌హెచ్-63 నిర్మాణాన్ని 150 ఫీట్ల వెడల్పుతో ముందస్తు సమాచారం అనుమతి లేకుండానే భూసేకరణ చేపట్టడంతో భూమిని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవతీసుకొని వీలైనంత త్వరగా రహదారి నిర్మాణానికి, భూసేకరణను నిలుపుదల చేయాలని, వెంటనే రహదాని పనులు ఆపివేయాలని రైతులు డిమాండ్ చేశారు.



జగిత్యాల లో ధర్నా చేస్తున్న బాధిత రైతులు

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన నృసింహస్వామి ఆలయం

కొడిమ్యాల, ఫిబ్రవరి 19: భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మండలంలోని నల్లగొండ నృసింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 20 నుంచి 24 వరకు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఎగువ, దిగువ ఆలయాలకు సున్నాలు, రంగులు వేశారు. పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా సిబ్బంది తొలగిస్తున్నారు. ఆలయ చైర్మన్ చెన్నాడి సత్యనారాయణ రావు, ఈవో వి అనూష ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు నీటి, వైద్య, మరుగుదొడ్ల సౌకర్యంతో పాటు నీడ సౌకర్యం కలిపించనున్నట్లు తెలిపారు. తాగు నీటి కోసం మూడు ట్యాంకులు, రెండు బోర్లు, 24 నల్లాల ద్వారా సౌకర్యం కలిపించనున్నట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఆలయ పరిధిలో భక్తులు ఉండటానికి మూడు షెడ్లు ఉండగా, అదనంగా నీడ కోసం చలువ పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయానికి 17 వసతి గదులు ఉన్నాయి.

కలెక్టర్, ఎమ్మెల్యేకు బ్రహ్మోత్సవాల ఆహ్వానం

నల్లగొండ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 20 నుంచి నిర్వహిస్తున్న ఆహ్వాన పత్రికను కలెక్టర్ యాస్మీన్‌బాషా, చొప్పదండి ఎమ్మెల్యే డా మేడిపల్లి సత్యంకు ఆలయ ఈవో వి అనూష, అర్చకులు శ్రీనివాసాచార్యులు, రజినీచార్యులు సోమవారం అందించారు. ఈవో, అర్చకులు ఎమ్మెల్యేకు స్వామి వారి తీర్థ ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది నర్సయ్య, నల్లగొండ గ్రామ నాయకులు మొగిలి నర్సయ్య, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఆలయ ఈవో

ఘాట్ రోడ్డుపై వాహనాలు నిషేధం: సీఐ

నల్లగొండ ఘాట్ రోడ్డుపై వాహనాలు నిషేధించామని మల్యాల సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నల్లగొండలోని లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సావాలను నిర్వహించనున్న నేపథ్యంలో సీఐ దామోదర్‌రెడ్డి, కొడిమ్యాల ఎస్సై సందీప్ ఎగువ, దిగువ ఆలయ పరిసరాలను సోమవారం పరిశీలించారు. అనంతరం సీఐ ఈవో కార్యాలయంలో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులు మెట్ల దారి గుండానే గుట్టపైకి వెళ్లి స్వామి వారిని దర్శించుకోవాలన్నారు. ఘాట్ రోడ్డుపై వాహనాలకు అనుమతి లేదన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. బ్రహ్మోత్సవాల్లో మద్యం అమ్మకాలు చేసిన, భక్తులను ఎవ్వరైన ఇబ్బందులకు గురి చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఆలయ పరిసరాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సీఐ వెంట కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్, ఆలయ ఈవో వి అనూష, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

జయశంకర్ వర్సిటీ వీసీ పదవికి గట్టి పోటీ!


28 మంది దరఖాస్తు.. వడపోత తర్వాత ఎంపిక

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ పదవికి గట్టి పోటీ నెలకొంది. ఏకంగా 28 మంది దరఖాస్తు చేసినట్లు సమాచారం. వీసీ పోస్టు కోసం ఈ నెల రెండో తేదీన రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా దరఖాస్తులకు సోమవారంతో గడువు ముగిసింది. 28 మంది దరఖాస్తు చేసినా... ప్రధాన పోటీ నలుగురైదుగురి మధ్యే ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీలో పరిశోధన విభాగం డైరెక్టర్(డీఆర్)గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన ఆర్. జగదీశ్వర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. జగదీశ్వర్‌ది కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలం. ఐదేళ్లు డీఆర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో వీసీ రేసులో ముందు వరుసలో ఉన్నారు. సీనియర్ ప్రొఫెసర్ ఎం.గోవర్ధన్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు నేతృత్వంలోని స్ర్కీనింగ్ కమిటీ దరఖాస్తులను పరిశీలించి.. ముగ్గురి పేర్లతో షార్ట్‌లిస్టు తయారుచేసి సీఎంకు పంపించనుంది. చివరిగా వీసీ నియామకాన్ని గవర్నర్ ఫైనల్ చేస్తారు. మొత్తం మీద వర్సిటీ వీసీ నియామకం పారదర్శకంగా నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ట్రైకార్ సబ్సిడీ స్వాహా!

(మొదటిపేజీ తరువాయి)

సుమారు రూ.130 కోట్ల నిధులు కేటాయించగా.. అందులో రూ.40 కోట్లకు పైగా సబ్సిడీ నిధులు స్వాహా అయినట్టు సమాచారం. ఈ పథకం కింద.. గిరిజన సహకార ఆర్థిక సంస్థ(ట్రైకార్) ద్వారా ఒక్కొక్క యూనిట్‌కు రూ.10 లక్షల నుంచి రూ.40లక్షల దాకా ఇస్తారు. యూనిట్ ఏర్పాటుకు అయ్యే మొత్తంలో 10 శాతాన్ని.. లబ్ధిదారులు తమ వాటా ధనంగా తొలుత ఏదైనా జాతీయ బ్యాంకులో జమచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం 60 శాతం సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన 30 శాతాన్ని బ్యాంకులు రుణం రూపంలో ఇస్తాయి. రుణానికి అర్హులైన వ్యక్తులు లేదా జేఎల్ గ్రూపులు సమీప జాతీయ బ్యాంకులో ఖాతా తెరిచి, తమ వాటా 10 శాతం అందులో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత రెండుమూడు దశల్లో బ్యాంకు.. సదరు యూనిట్‌కు సామగ్రి అందించే సంస్థల పేరు మీద మాత్రమే చెక్కులు అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వ రాయితీ 60 శాతం. ఇదీ పథకం స్వరూపం. దీని కింద.. తెలంగాణలోని ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ, భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం ఐటీడీఏ, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏల ద్వారా 2020-22లో సుమారు రూ.130కోట్లకు పైగా రుణాలు మంజూరు కాగా.. రూ.62 కోట్ల సబ్సిడీ నిధులు విడుదల చేసినట్లు సమాచారం.



ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశాల జేఎల్ గ్రూపు చెక్‌పై ఏటురునాగారం ఐటీడీఏ పీవో సంతకం

పక్కదారి ఇలా..

నిబంధనల ప్రకారం.. బ్యాంకులు గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఐటీడీఏ పీవోల ప్రత్యేక ఖాతాలకు సబ్సిడీ మొత్తాన్ని జమ చేస్తాయి. ఐటీడీఏ పీవోలు.. ఎంపికైన లబ్ధిదారుల ఖాతాకు సబ్సిడీని జమ చేయాలి. కానీ, బ్యాంకు ఇచ్చే 30శాతం రుణంతో సంబంధం లేకుండా కేవలం సబ్సిడీ డబ్బులతో యూనిట్లకు కావాల్సిన సామగ్రిని లబ్ధిదారులకు ఐటీడీఏ అధికారులే అంటగడుతున్నారు. చాలా చోట్ల పాత సామగ్రిని ఇచ్చి, లబ్ధిదారులతో సంతకాలు చేయించుకుని వెళ్తున్నారు. సరైన సామగ్రి లేక తర్వాత ఆ యూనిట్లు మూలనపడుతున్నాయి. ఉదాహరణకు.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని కొత్తగూడలో శ్రీమునసలమ్మ ట్రైబల్ జేఎల్ గ్రూపునకు దాల్ మిల్ యూనిట్ కోసం రూ.40లక్షలు మంజూరయ్యాయి. స్థానిక ఇండియన్ బ్యాంకులో ఖాతా తెరిచి తమ వాటాధనం 10 శాతం (రూ.4 లక్షలు) జమ చేశారు. నిబంధనల ప్రకారం దాల్ మిల్ యంత్రాల కొనుగోలు డబ్బులను బ్యాంకు ద్వారా చెల్లించాలి. కానీ, ఆ యంత్రాలను ఓ మధ్యవర్తి ద్వారా ఐటీడీఏ అధికారులే కొనుగోలు చేసి తూతూమంత్రంగా మిల్లును ఏర్పాటు చేశారు. సుమారు రూ.8 లక్షల వరకూ ఖర్చు చేసినట్టు లెక్కలు చూపారు. ట్రయల్ రన్ పేరుతో ఆ యూనిట్‌ను మూడు రోజులు నడిపించిన సభ్యులు.. ముడి సరుకులు లేకపోవటంతో పాటు ఇంకా రావాల్సిన ఇతర యంత్రాలు లేక మిల్లును మూసేశారు. నాలుగేళ్లుగా ఆ దాల్ మిల్ నడవటం లేదు. మిగతా సబ్సిడీ సొమ్ము ఏమైందో ఎవరికీ తెలియదు. కాగా, గ్రూపు వాటాధనంగా బ్యాంకులో ఉన్న రూ.4 లక్షల్లో రూ.2.50 లక్షలు యూనిట్ కోసం ఇచ్చిన బంగ్లా మరమ్మతుల కోసమని కాంట్రాక్టర్ రంజిత్‌కు ఐటీడీఏ ఏపీవో ఆదేశాలతో ఇచ్చినట్లు గ్రూపు సభ్యులు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఇప్పటి వరకు ఆ డబ్బులు తిరిగివ్వలేదు. అలాగే.. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని పాల్వంచ మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన గిరిజనులకు శ్రీరాయకపోడు ట్రైబల్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఎంఎస్ఎంఈ గ్రూపునకు కళాకృతుల తయారీ కోసం రూ.32.15 లక్షల రుణం మంజూరైంది. ఈ గ్రూపునకు సంబంధించిన 10శాతం వాటా ధనాన్ని (రూ.3.22 లక్షలు) బ్యాంకులో కాకుండా.. ఫోన్‌పే ద్వారా ఒక అధికారి తన వ్యక్తిగత ఖాతాలో జమ చేయించుకున్నారు. భద్రాచలంలోని పాత ఎన్ఆర్‌సీ భవనంలో యూనిట్ ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఐటీడీఏ అధికారులు ఈ యూనిట్ ఖాతాలో రెండు విడతల్లో రూ.5.50లక్షలు జమ చేశారు. అందులో నుంచి భవన మరమ్మతులు, సున్నం కోసమని రూ.4.50లక్షలు వాడేసుకున్నారు. ఆ కాంట్రాక్టును కూడా.. సదరు అధికారి తన దగ్గరి బంధువుకే సమర్పించేసుకున్నారు. రూ.1.50లక్షలతో కొంత సామగ్రి తీసుకొచ్చి ఆ భవనంలో ఉంచారు. ఈ యూనిట్‌కు రావాల్సిన సబ్సిడీ రూ.19.29 లక్షలు. అయితే కేవలం రూ.6 లక్షలే లెక్క చూపిస్తున్నారు. మిగతా రూ.13.29లక్షల సబ్సిడీ ఎవరి ఖాతాలోకి వెళ్లిందనేది చర్చనీయాంశంగా మారింది. బ్యాంకుతో సంబంధం లేకుండా సబ్సిడీ నిధులను వాడటం నిబంధనలకు విరుద్ధం. శాఖ అంతర్గత ఆడిట్‌లో ఈ విషయం వెలుగులోకి వచ్చినా పై అధికారుల దృష్టికి వెళ్లకుండా ఐటీడీఏ స్థాయిలోనే 'మేనేజ్' చేశారనే ప్రచారం జరుగుతోంది. ఇందులో ఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి కీలక పాత్ర పోషించినట్టు సమాచారం. ప్రస్తుతం ఆ కళాకృతుల తయారీ కేంద్రం కళతప్పింది.

మూడో ఉదాహరణ..

మహబూబాబాద్ జిల్లా గార్లలో శ్రీసారలమ్మ జేఎల్ గ్రూపునకు సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రానికి రూ.25లక్షల రుణం మంజూరైంది. గార్లలోని ఎస్‌బీఐలో ఖాతా తెరిచి తమ వాటాధనం రూ.2.50 లక్షలు జమచేశారు. ఇక్కడ బ్యాంకు లోన్ రూ.7.50 లక్షలతో సంబంధం లేకుండానే డీఆర్‌డీఏలో పని చేసే ఓ అధికారి ఐటీడీఏ అధికారులతో కలిసి యూనిట్ ప్రారంభిస్తున్నామని చెప్పి, రూ.5లక్షల సబ్సిడీని బ్యాంకు ఖాతాలో జమ చేయించారు. ఇందులో నుంచి రూ.3లక్షలు పి.శ్రీనివాస్ అనే వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. మిగతా రూ.2లక్షలు జేఎల్ గ్రూపు డ్రా చేసుకున్నట్టుగా బ్యాంకు రికార్డులున్నాయి. ఈ పథకం కింద ఖాతా తెరిచిన తరువాత యూనిట్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసిన కంపెనీకే పేమెంట్లు చేయాలి. వ్యక్తిగతంగా వాడుకోవడానికి వీలులేదు. అయితే పి.శ్రీనివాస్ ఎవరు.. ఆయనకు ఎందుకు జమ చేశారనేది చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసమని రూ.3.80లక్షలు ఎన్‌పీడీసీఎల్‌కు డీడీ రూపంలో చెల్లించారు. బ్రిక్స్ యూనిట్ కోసం ప్రత్యేకంగా ఇంత పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఎందుకనేది సమాధానం లేని ప్రశ్న. బయ్యారంలో కూడా సిమెంట్ ఇటుకల యూనిట్‌లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో అశ్వారావుపేట, దమ్మపేటలో కొండరెడ్లకు మంజూరైన యూనిట్లు, భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లోని కోయలకు మంజూరైన యూనిట్లలో సబ్సిడీ వారికి తెలియకుండా గిరిజన సంక్షేమశాఖ అధికారులు స్వాహా చేసినట్టు సమాచారం. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశల, లింగాల, ములుగు మండలం జంగాలపల్లి, కొత్తగూడ మండలం దొరవారి వేంపల్లి, పొగులపల్లి గ్రామాల్లోని జేఎల్ గ్రూపులకు మంజూరైన నిధులూ దారి తప్పినట్టు తెలుస్తోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలో రూ.40కోట్లకు పైగా సబ్సిడీ నిధులు ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు పక్కదారి పట్టించారని సమాచారం.

పీవోలకు చెక్ పవర్!

ప్రభుత్వ పథకాల కోసం ఏర్పాటు చేసుకునే లబ్ధిదారుల గ్రూపులో అధ్యక్ష, కార్యదర్శులకు చెక్‌పవర్ ఉంటుంది. ఆ ఇద్దరి పేరిటే బ్యాంకులో ఖాతా తెరుస్తారు. అయితే ఈ పథకంలో మాత్రం ఐటీడీఏ పీవోలు కూడా తమ పవర్ చూపిస్తున్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీవో.. లబ్ధిదారులతో పాటు తనకు కూడా చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు రాయడమే కాకుండా, చెక్కులపై సంతకాలు చేసేస్తున్నారు. దీంతో ఇతర ఐటీడీఏ పీవోలకు కూడా ఆశ పుట్టి జేఎల్ గ్రూపుల్లో తమకు కూడా జాయింట్ చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు వ్రాసి సాధించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.2.50లక్షలు తీసుకున్నరు



మేం పెట్టిన దాల్ మిల్ నాలుగేళ్లుగా మూత పడింది. బ్యాంకు నుంచి లోన్ ఇవ్వలేదు. సబ్సిడీ కూడా రాలేదు. మిషన్లు ఐటీడీఏ వాళ్లే ఇచ్చిండ్లు. మూడు రోజులు ట్రయల్ నడిపినం. ముడిసరుకు లేకపోవటంతో బంద్ జేసినం. మా వాటా కింద బ్యాంకుల జమ చేసిన రూ.5 లక్షల నుంచి కాంట్రాక్టర్ రంజిత్‌కు రూ.2.50 లక్షలు ఇచ్చినం. ఐటీడీఏ ఏపీవోతోపాటు మరో ఇద్దరు అధికారులు కాంట్రాక్టర్‌కు ఆ పైసలు ఇవ్వాలని చెప్పారు. మిల్ నడిపే రూమ్‌ను ఏదో రిపేర్ చేస్తామని తీసుకున్నారు. మళ్లీ ఇస్తామని చెప్పి నాలుగేళ్లవుతున్నా మా డబ్బులు ఇవ్వలేదు. సబ్సిడీ రావటం లేదు. దాల్ మిల్ నడవటం లేదు. మేం అన్ని రకాలుగా నష్టపోయాం.

\- భూపతి శ్యామల,
కొత్తగూడ, జేఎల్ గ్రూపు అధ్యక్షురాలు

చక్రం తిప్పింది ఆయనే!

గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలోని ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగే ఈ మొత్తం దందాలో కీలక పాత్ర పోషించారని సమాచారం. ఆ 'లక్ష్మీ'పుత్రుడు తనకు తానే రాష్ట్రంలో ఈ మిషన్ మేనేజర్‌గా చెప్పుకొంటూ సబ్సిడీ నిధులను అవినీతి అధికారులకు 'ప్రసాదం'లా పంచారనే చర్చ గిరిజన శాఖలో జరుగుతోంది. శాఖలోని ప్రధాన అధికారుల నుంచి ఐటీడీఏలోని కింది స్థాయి అధికారి వరకూ అందరినీ ఆయన వాటాలతో మేనేజ్ చేస్తున్నట్టు సమాచారం. గత ప్రభుత్వ హయంలో గిరిజనశాఖ మంత్రి సమీప బంధువు కూడా ఒకరు ఈ సబ్సిడీ స్వాహాపర్వంలో కీలకంగా ఉన్నట్లుగా సమాచారం. ఈ అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ జరిపించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ
హరికృష్ణ సస్పెన్షన్ ఉత్తర్వులు కొట్టివేత

- సస్పెన్షన్‌పై హైకోర్టుకు వెళ్లిన మాజీ ఓఎస్డీ
- కాంపిటెంట్ అథారిటీ జారీ చేయలేదంటూ సస్పెన్షన్ ఉత్తర్వుల కొట్టివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్‌కు గురైన హకీంపేట స్పోర్ట్స్ పాఠశాల మాజీ ఓఎస్డీ టి.హరికృష్ణకు హైకోర్టులో ఊరట లభించింది. కాంపిటెంట్ అథారిటీ మాత్రమే జారీ చేయాలంటూ ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులను ధర్మాసనం కొట్టివేసింది. హరికృష్ణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను విధుల్లోంచి తొలగిస్తూ అప్పటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీ అండ్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి ఫిర్యాదు, విచారణ లేకుండా సస్పెండ్ చేయడం చెల్లదని, ఆధారాలు లేకపోయినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని యువజన వ్యవహారాలు, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారని, ఈ ఉత్తర్వులు చెల్లవని హరికృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ పశు సంవర్థక శాఖలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా నియమితులయ్యారని, 2020లో హకీంపేట స్పోర్ట్స్ పాఠశాలకు ఓఎస్డీగా డిప్యూటేషన్‌పై వెళ్లారని ఆయన తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు, కారణాలు లేకుండా, అధికార పరిధికి విరుద్ధంగా కేవలం ఆరోపణలు వచ్చాయని పేర్కొంటూ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పిటిషనర్ డిప్యూటేషన్‌పై క్రీడా శాఖకు వెళ్లారని, సరైన కారణాలు, విషయ తీవ్రత ఉన్నా కాంపిటెంట్ అథారిటీ మాత్రమే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయగలరని వ్యాఖ్యానించింది. ఈ కేసులో పశు సంవర్థక శాఖ ముఖ్య కార్యదర్శి అపాయింటింగ్ అథారిటీ అని.. ఇప్పటి వరకు ఎలాంటి చార్జి మెమో జారీ చేయలేదని గుర్తు చేసింది. రాష్ట్ర పశుసంవర్థక శాఖ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా ఉన్నందున సదరు సస్పెన్షన్ ఉత్తర్వులను కొట్టి వేస్తున్నట్లు తుది తీర్పు జారీ చేసింది.

కుట్ర చేసి, ఇరికించి సస్పెండ్ చేశారు

- కవిత, శ్రీనివాస్ గౌడ్ స్వార్థానికి నన్ను బలి చేశారు
- మాజీ సీఎం పేషీలోని భూపాల్‌రెడ్డికి మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదని నాపై కుట్ర
- హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ హరికృష్ణ ప్రకటన

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలోని పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గలేదన్న కారణంగానే తనను కుట్రపూరితంగా ఇరికించి.. సస్పెండ్ చేశారని హకీంపేట క్రీడా పాఠశాల మాజీ ఓఎస్డీ హరికృష్ణ తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలను తెలుసుకోకుండా అహంకారంతో ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారని, పైవారి మన్ననల కోసం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తనను బలి చేశారని ఆరోపించారు. గత ఏడాది హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన ఒక ఘటనకు సంబంధించి తనపై నమోదైన కేసు విషయంలో ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చిందని పేర్కొంటూ సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. సీట్ల కేటాయింపు విషయంలో గతంలో స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌గా ఉన్న ఆంజనేయగౌడ్, ఆయన పీఏ (రిటైర్డ్) నర్సయ్య, శాట్స్ మాజీ ఛైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తనను ఒత్తిడికి గురి చేశారని, అప్పటి సీఎం కేసీఆర్ పేషీలోని భూపాల్‌రెడ్డికి రోజూ మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదన్న కారణంగా అందరూ కలిసి తనను బలి పశువును చేశారని తెలిపారు. తనను సస్పెండ్ చేసిన రోజే ఆ స్థానంలో వెలమ సామాజిక వర్గానికి చెందిన ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించారని, నిజానికి అది రాష్ట్రస్థాయి పోస్టు అని, దానిలో కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించకూడదన్న నిబంధనలు ఉన్నాయని వివరించారు. అయినా వాటిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. విచారణ సమయంలో అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ, శాట్స్ మేనేజర్‌లకు అడ్మినిస్ట్రేటివ్ స్వేచ్ఛను ఇచ్చి ఉంటే వారు సమగ్రమైన విచారణ జరిపే వారని, తద్వారా తనకు న్యాయం జరిగేదని తెలిపారు. గత ప్రభుత్వంలో పైవాళ్లు ఏది చెబితే దానినే వేదం అన్నట్టుగా వ్యవహరించేవారని ఆరోపించారు. తనపై ఆరోపణ వచ్చిన రోజు ఉదయం 9 గంటలకే ప్రెస్‌మీట్ పెట్టి మరీ తనను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎవరిపైన అయినా ఫిర్యాదు కానీ అనుమానం కానీ వస్తే ముందు చర్యలు తీసుకుని, ఆ తరువాత విచారణ చేస్తామని గత ప్రభుత్వం చెప్పిందని, అదే సరైన విధానమైతే.. ఇప్పుడు ఎవరైనా తప్పులు చేసినట్టు ప్రభుత్వం దృష్టికి వస్తే ముందుగా చర్యలు తీసుకుని, ఆ తర్వాత విచారణ చేయించాలని సీఎం రేవంత్‌ను కోరారు. తన కుటుంబ గౌరవ మర్యాదలను నాశనం చేసిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

కాళేశ్వరం ఒప్పందాలు బయటపెట్టాలన్న పిటిషనర్‌కు హైకోర్టు అక్షింతలు

- చట్టం, ప్రజా ప్రయోజన వ్యాజ్యం రూల్స్ చదువుకొని రావాలని చురకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఎన్ని ఒప్పందాలు జరిగాయో వాటన్నిటినీ బయటపెట్టడంతోపాటు పూర్తి వివరాలను కోర్టు ఎదుట ఉంచాలంటూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు మీకు పిల్ రూల్స్ తెలుసా!? అని మండిపడింది. గత ఏడాది నవంబర్ 16న సికింద్రాబాద్‌కు చెందిన మధుగంటి విశ్వనాథ్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది నందిత గుహ వాదనలు వినిపించడానికి సిద్ధమవగా ధర్మాసనం జోక్యం చేసుకుంది. "పిటిషనర్‌ను సీనియర్ న్యాయవాది అని పేర్కొన్నారు. హైకోర్టు గుర్తించకుండా సీనియర్ న్యాయవాది అని ఎలా సంబోధిస్తారు? చట్టం, ప్రొసీజర్ తెలియకుండానే ఇక్కడికి వచ్చారా? ఇలాంటి పిటిషన్లు ఎందుకు వేస్తారో తెలుసు. ఆ తర్వాత ఎక్కడెక్కడ చర్చలు జరుపుతారో తెలుసు. హైకోర్టు లైబ్రరీలో కూర్చొని పిల్ రూల్స్, చట్టం చదువుకోండి. ఆ తర్వాత ఈ అంశాలపై పిల్ వేయవచ్చా? లేదా? అనేది మీకే అర్థమవుతుంది. పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ అంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు" అంటూ తలంటింది. పిటిషన్లో మార్పులు చేసి రావాలంటూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

గ్రామసభ కోరం రూల్స్ సవరణపై పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామసభ నిర్వహణకు ఉండాల్సిన 'కోరం' నిబంధనలు సవరిస్తూ జారీ చేసిన జీవో 54 చెల్లదని పేర్కొంటూ ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. లంబాడా హక్కుల పోరాట సమితి నాయకుడు దేవానాయక్ దీనిని దాఖలు చేశారు. గ్రామసభ నిర్వహణకు మూడో వంతు హాజరైతేనే కోరం ఉన్నట్లని, అందులో సగం ఎస్టీలు ఉండాలనే నిబంధనలను సవరించారని, ఇది పెసా చట్టంతోపాటు గిరిజన ప్రాంతాల్లోని ప్రజల హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ..
బీజేపీతో పొత్తు పెట్టుకోదు: బాల్క సుమన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని, తమ పార్టీ అధినేత కేసీఆర్ సెక్యులర్ నాయకుడని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తమ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని తాము ఎక్కడా చెప్పలేదని, ఎవరినీ అడగలేదన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇతర నాయకులు బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదనడం తగదని చెప్పారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు మీడియాకు లీక్ లిస్తున్నారని, పత్రికల్లో రాయిస్తున్నారని అన్నారు. 15 రోజుల్లో నలుగురు గురుకుల విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారని, దీన్ని పట్టించుకోకుండా రాష్ట్రంలో సమస్యలే లేనట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని, కాంగ్రెస్ హైకమాండ్‌కు డబ్బు సంచులు మోస్తున్నారని ఆరోపించారు.

వైటీపీపీ వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నేడు

నల్లగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో తెలంగాణ సర్కారు నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీపీ) వద్ద మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఇందులో ప్రజల నుంచి సానుకూలత వస్తేనే ప్లాంట్‌కు కేంద్ర పర్యావరణ శాఖ అన్ని అనుమతులు జారీ చేస్తుందని, అప్పుడే ప్లాంట్ నుంచి అధికారికంగా విద్యుదుత్పత్తికి మార్గం సుగమమవుతుందని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఇళ్లు కోల్పోయిన గిరిజనులకు వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కొంతమందికి పరిహారాలు అందలేదని, వాటన్నింటినిపై తేల్చాలని నిలదీసేందుకు భూ నిర్వాసితులు సిద్ధమవుతున్నారు.

825 శాతం పెరిగిన ఆక్సిజన్ బెడ్స్

- దేశవ్యాప్తంగా సర్కారు ఆస్పత్రుల్లో ప్రస్తుతం 5.15 లక్షల బెడ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ బెడ్ల సంఖ్య 825 శాతం పెరిగినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 5,15,345 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు తెలిపింది. అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ పడకల వివరాలను కేంద్రం తాజాగా విడుదల చేసింది. ఈ పడకలన్నీ ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. 2020 ఏప్రిల్ నాటికి మన దేశంలో కేవలం 62,458 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. ప్రస్తుతం దేశంలో అత్యధికంగా 1,32,314 ఆక్సిజన్ బెడ్స్ మహారాష్ట్రలో ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ఆ రాష్ట్రంలో 11,254 ఆక్సిజన్ బెడ్స్ ఉండేవి. 61,074 ఆక్సిజన్ బెడ్స్‌తో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్(42,221), గుజరాత్(40,708), పశ్చిమబెంగాల్(28,267), కర్ణాటక(27,707) రాజస్థాన్(20,116) నిలిచాయి. తెలంగాణలో 2020ఏప్రిల్ నాటికి సర్కారీ దవాఖానాల్లో 181 ఆక్సిజన్ పడకలుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 13,664కు పెరిగినట్లు కేంద్రం పేర్కొంది. కాగా, దేశవ్యాప్తంగా ఉన్న ఆక్సిజన్ పడకల్లో 25.86 శాతం దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో 1,33,289 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది.

టీఎస్ పీఈసెట్ షెడ్యూల్ విడుదల

టీఎస్-పీఈసెట్- 2024 షెడ్యూల్‌ను శాత వాహన విశ్వవిద్యాలయం కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ సోమవారం విడుదల చేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు గాను మార్చి 14 నుంచి మే 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆలస్యరుసుంతో మే 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

ఖమ్మంలో చట్టవిరుద్ధంగా పోలీసుల ప్రవర్తన

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రధాన కార్యదర్శి

ఖమ్మం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పోలీసులు గ్రామాల్లో చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజలను భయోత్పాతానికి గురి చేస్తున్నారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య ఆరోపించారు. తమ పార్టీ కార్యదర్శి అశోక్, కమిటీ సభ్యుడు గోపన్న, సభ్యులు ఎస్కే మదార్, కే సురేష్‌ను ఫిబ్రవరి 14న అదుపులోకి తీసుకున్న పోలీసులు అక్రమంగా నిర్బంధించి ఫిబ్రవరి 16న మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని, వీరితోపాటు మరో 24 మందిపై సెక్షన్124-బి కింద కుట్ర కేసులు పెట్టారని విమర్శించారు. సీఎం జోక్యం చేసుకుని పోలీసు శాఖపై సమీక్ష చేయాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 19: మండలంలోని యూసుఫ్‌నగర్, అయిలాపూర్, ధర్మారం, తిమ్మయ్యపల్లి, పైడిమడుగు, జోగినిపల్లి, చిన్నమెట్‌పల్లి, మోహన్‌రావుపేట, గుమ్లాపూర్, వెంకటాపూర్, మాదాపూర్, సంగెం, నాగులపేట గ్రామాలలో సోమవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులతో కలిసి కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. గత ప్రభుత్వంలో మంజూరైన 40 మంది లబ్ధిదారులకు రూ. 46,05,336 విలువగల చెక్కులను పంపిణీ చేశారు. అలాగే పలు గ్రామంలో గత ప్రభుత్వంలో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను తప్పుడు ప్రచారం చేస్తూ బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు పబ్బం గడుపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ నాయకులు చీటి వెంకటరావు, దారిశెట్టి రాజేష్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాయికల్, ఫిబ్రవరి 19: రాయికల్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో అయ్యప్పస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు సాయప్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం మధుసూదనానంద సరస్వతి స్వామి సమక్షంలో బ్రహ్మశ్రీ గంగవరం నారాయణ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డిలు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నివేదిత కృష్ణారావు, వైస్ చైర్మన్ హిమవంతరావు, మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, జడ్పీటీసీ అశ్విని జాదవ్, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు ఇంతియాజ్, కోల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు మర్రిపెల్లి శ్రీనివాస్, కౌన్సిలర్ మహేందర్, నాయకులు నారాయణ గౌడ్, లింగంగౌడ్, లావణ్యవేణు, చంద్రశేఖర్, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి జాతర

- ఆకట్టుకున్న శివపార్వతుల కల్యాణం

రాయికల్, ఫిబ్రవరి 19: రాయికల్‌లో సోమవారం గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో రాయికల్-చెర్లకొండాపూర్ చెరువు కట్టపై గల గంగామాత దేవాలయ 16వ వార్షికోత్సవం సందర్భంగా శివపార్వతుల కల్యాణ వేడుకలు అంబరాన్నంటాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, దేవుని నారాయణ, భూమయ్య, రవీందర్, ధర్మపురి రాములు, రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రాయికల్, ఫిబ్రవరి 19: మండలంలోని రామాజీపేట గ్రామంలోని పశువుల కొట్టంలో దాచి ఉంచిన 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు సోమవారం పట్టుకొని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు తెలిపారు. రేషన్ బియ్యం ఎవరైనా అక్రమ రవాణా నిల్వ చేసినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ దాడుల్లో జగిత్యాల సివిల్ సప్లై డీటీ వరప్రసాద్, మల్యాల సివిల్ సప్లై డీటీ బూస రాజు శ్రీనివాస్, మల్యాల సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్‌లు స్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పద్మయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు

బీర్‌పూర్, ఫిబ్రవరి 19: కాంగ్రెస్ ప్రభుత్వం విధానానికి ఆకర్షితులై ఎమ్మెల్సీ టీ.జీవన్ రెడ్డి సమక్షంలో సోమవారం బీర్‌పూర్ మండలంలోని నర్సింహులపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సూధ నారాయణ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చెరుపూరి సుభాష్ యాదవ్, నాయకులు చిక్కుళ్ల చంద్రయ్య, మెరుగు రమేష్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

నేడు మెట్‌పల్లి మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం

మెట్‌పల్లి, ఫిబ్రవరి 19: మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మోహన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 2:30కు 2024-25 ఆర్థిక సంవత్సరం సంబంధించిన మున్సిపల్ బడ్జెట్ సమావేశం చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు.

కరపత్రాల పంపిణీలో ఎమ్మెల్సీ తమ్ముడి హస్తం

- బీజేపీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి సుఖేందర్‌గౌడ్

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 19: ఎంపీ అర్వింద్‌కు వ్యతిరేకంగా కరపత్రాలను ముద్రణ, పంపిణీ వెనుక ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తమ్ముడు దేవేందర్‌రెడ్డి హస్తం ఉందని బీజేపీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని సమావేశంలో ఆయన మాట్లాడారు. 45 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రైతుల కోసం చేయని పనిని ఎంపీ అర్వింద్ చేసినందుకు ఇలాంటి ప్రచారాలకు పాల్పడం సరికాదన్నారు. బీజేపీలో సస్పెండ్ అయిన వారితో, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేసేవారితో ఇటీవల దిష్టిబొమ్మ దహనం చేయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్, ధోనికేల నవీన్, బత్తిని శంకర్ గౌడ్, బోడ్ల నరేస్, పాల్గొన్నారు.

సమ్మక్క జాతర ఏర్పాట్ల పరిశీలన

పెగడపల్లి, ఫిబ్రవరి 19: మండల కేంద్రంలో సమ్మక్క సారక్క జాతర ఏర్పాట్లను సోమవారం గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో ఎనబోయిన శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. జాతర కమిటీ బాధ్యులతో పాటు గ్రామ నాయకులతో కలసి గద్దెల వద్దకు వెళ్లి ఏర్పాట్లు పరిశీలించారు. విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి ఏర్పాట్లు, భక్తులకు వసతి తదితర విషయాల గురించి అడిగి తెలుసుకుని గ్రామపంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించేలా భక్తులకు వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. తాజా మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, నాయకులు బొమ్మెన స్వామి, వెంకటేశం, సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, స్వామి, టెక్నికల్ అసిస్టెంట్ రాజేశం తదితరులు ఉన్నారు.

జగిత్యాల రూరల్: తెలంగాణ రాష్ట్రంలో పేరుగాంచిన సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలను జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలోని నర్సింహులగుట్టపైన ఈ నెల ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు తెలిపారు. ఈ నెల 21 న పొలిమేరబంధన, అంకమ్మ లక్ష్మీదేవత, పంచపాండవులపూజ, సారలమ్మదేవి వరాలకుండలు, గద్దెలు నిండుకొనుట, 22 తేదీన హోమం, సుంకుప్రారంభం, మిరిమిడి, వనంగద్దెలు నిండుకొనుట, సమ్మక్కదేవి గద్దెనిండుకొనుట, 23 వ తేదీన మొక్కులు, 24న బలిహరణము కార్యక్రమాలుంటాయని ఆలయ ఫౌండర్ పడాల రవీందర్, అనువంశికపూజారి బైరబోయిన వెంకటయ్య తెలిపారు. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

బాలరత్న అవార్డు అందుకున్న చిన్నారి

రాయికల్, ఫిబ్రవరి 19: మండలంలోని ఇటిక్యాల మోడల్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న నేహశ్రీ జూనియర్ డ్యాన్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. మల్యాల నరేష్-లత దంపతుల కూతురు నేహశ్రీ ఇటీవల నిర్వహించిన మాస్క్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాల జూనియర్ డ్యాన్స్ పోటీల్లో పాల్గొంది. ఉత్తమ ప్రతిభ కనబరిచి కామెడీ నటుడు సదయ్య చేతులమీదుగా అవార్డు, సర్టిఫికెట్‌ను అందుకుంది. ఉమ్మడి జిల్లా పరిధిలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని మొదటి బహుమతి గెలుపొందిన నేహశ్రీని గ్రామస్థులు, బంధువులు అభినందించారు.

కొండంత ఆశలు

కొత్త ప్రభుత్వం నిర్ణయంపై అంజన్న భక్తుల ఎదురుచూపులు

కొండగట్టు అభివృద్ధి, పర్యాటకమే ప్రాధాన్యం

ఇరవై ఏళ్లుగా పట్టాలెక్కని మాస్టర్ ప్లాన్



మల్యాల, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభు త్వంపై కొండగట్టు అభివృద్ధి ఆశలు పెరిగాయి. ఏడాది క్రితం అప్పటి సీఎం కేసీఆర్ కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధికి వంద కోట్ల రూపాయలు మంజూరు చేస్తామనే ప్రకటన చేయగా, ఫిబ్రవరిలో అంజన్న క్షేత్రాన్ని సందర్శించారు. కొండగట్టు అభివృద్ధికి మ రో 500 కోట్లు ఖర్చు చేస్తామని యాదాద్రి తరహాలో తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. అందుకనుగుణంగా యాదాద్రి ఆర్కిటెక్ ఆనందసాయి పలుమార్లు కొండగట్టును సందర్శించారు. మాస్టర్‌ప్లాన్ రూపకల్పన చేపట్టారు. అయితే ప్రభుత్వం మారడంతో అది అటకెక్కినట్లు అయింది. తాజాగా నూతన ప్రభుత్వంపై భక్తులు ఆశలు పెంచుకుంటున్నారు. కొండగట్టుకు ఏటా జరిగే పెద్ద, చిన్న హనుమాన్ జయంత్యుత్సవాలకు లక్షల్లో ప్రతి మంగళ, శనివారాల్లో వేలాదిగా భక్తులు అంజన్నను దర్శించుకుంటుండగా, సాలీన రూ.20 కోట్ల ఆదాయం ఆలయానికి సమకూరుతోంది.

కొండగట్టుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తుండగా, వారికి కనీస అవసరాలు తీర్చడానికి ఓ ప్రణాళిక రూపొందించడం, మాస్టర్ ప్లాన్ అమలుకు కార్యాచరణ చేపట్టాల్సి ఉంది. గత ప్రభుత్వం యాదాద్రి పుణ్య క్షేత్ర అభివృద్ధికి ప్రత్యేక కృషి చేసినట్లే ప్రస్తుత ప్రభుత్వం కొండగట్టు అభివృద్ధికి కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు. ప్రస్తుతం కొండగట్టులో బస చేయడానికి గాను కేవలం 50లోపే గదులు అందుబాటులో ఉన్నాయి. దీంతో నిత్యం వందలాదిగా భక్తులు ఆరుబయట, చెట్ల కింద పడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పాటు కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో భక్తులు వెతలు వర్ణనాతీతం. దాదాపు 400 ఎకరాల భూములు దేవస్థానానికి ఉన్నప్పటికీ పర్యాటక అభివృద్ధికి కూడా ఏమాత్రం నోచుకోవడం లేదు.



● రూ. 300కోట్లతో ఆలయ విస్తరణ ప్రతిపాదనలు..

ప్రస్తుతం ఉన్న ఆలయాన్ని విశాలంగా.. వెనుకాల బేతాళుడి ఆలయం, ముం దున గల యాగశాల అందులోనే వచ్చే విధంగా విస్తరించడం, మాడవీధులు ఏర్పాటు, ఆలయంలోని స్వామి వారి మూలవి రాట్టు ముట్టుకోకుండా ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ విస్తరణ చేయడానికి కేసీఆర్ పర్యటన అనంతరం స్థపతి దాదాపు 300 కోట్లతో మాస్టర్ ప్లాన్ రుపొందించారు. యాదాద్రి తర హాలో అభివృద్ధికిగాను విశాలమైన ప్రాకారం, గర్భాలయం, మహమండపం, అర్ధమండపం, అంతరాలయం, క్యూలైన్లు ఏర్పాటు ముఖ్యంగా అందులో ఉండనుంది. స్థపతులు, శిల్పులతో యాదాద్రిని విస్తరించినట్లు కొండగట్టు కూడా అలాగే చేయడానికి రుపొందించిన మాస్టర్‌ప్లాన్ మళ్లీ నిలిచి పోయింది. దీంతో ఇటీవల దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొండా సురేఖ సంబంధిత అధికారుల సమీక్షలో కొండ గట్టు దేవస్థానం అధికారులతో ఆరా తీశారు. అయితే కొండగట్టు అభి వృద్ధికి యాదాద్రి మాదిరిగా కొండగట్టు టెంపుల్ డెవలప్‌మెంట్ అథా రిటిని ఏర్పాటు చేసి యాదాద్రిలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

● గతంలో పొన్నం, మేడిపల్లి ఆందోళనలు..

గతంలో ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మె ల్యే మేడిపల్లి సత్యం కొండగట్టు అభివృద్ధికి అనేక ఆందోళనలు చేపట్టారు. దేవస్థానం అభివృద్ధికి వంద కోట్లు ఆపై నిధులు మంజూరు చేయాలని పాదయాత్రలు, ధర్నాలు రాస్తారోకోలు కూడా చేశారు. ప్రస్తుతం వారిద్దరు ప్రభుత్వంలో ఉండడంతో సహజంగానే కొండగట్టు అభివృద్ధి ఆశలు భక్తుల్లో పెరిగాయి. కొండగట్టు అభివృద్ధికి యాదాద్రి అభివృద్ధి తరహాలో నిధులు తీసుకువస్తారనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. శాసనసభ ఎన్నికలకు ముందు కొండ గట్టు అంజన్నను దర్శించుకున్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా అంజన్నను దర్శించుకొని ఆలయ అభి వృద్ధిపై అప్పటి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి సీఎం కావడం కూడా కొండగట్టు అభివృద్ధిపై ఆశలు పెంచగా రాష్ట్రంలోనే గొప్ప క్షేత్రంగా తీర్చిదిద్దుతారనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వంద కోట్లు మంజూరు

కొండగట్టుకు అభివృద్ధికి గత ప్రభుత్వం వంద కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. అప్పటి సీఎం కేసీఆర్ కొండగట్టు పర్యటనకు కొన్ని రోజుల ముందు నిధుల మంజూరు జీవో జారీ కాగా ఇప్పటి వరకు ఆ నిధులతో చేపట్టిన పనులు నామమాత్రమే. కొండపైకి నీటిని అందించడానికి గాను సంతోళ్లద్దికి వరదకాలువ నుంచి నీటిని తరలించడానికి రూ.13 కోట్లతో పనులు చేపట్టారు. ఈ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. దీంతోనిధులపై నీలినీడలు కమ్ముకున్నాయి.

ఎమ్మెల్యే నోటా.. కొండగట్టు మాట

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శాసనసభలో మొదటి సారి ప్రసంగంలో మొదటగా కొండగట్టు అభివృద్ధి ప్రస్తావన తోనే ప్రారంభించడంతో ఇక్కడి అభివృద్ధిపై భక్తులు ఆశలు రెట్టింపు అయ్యాయి. కొండ గట్టుకు గత ప్రభుత్వం 100కోట్లు ప్రకటించిందని వాటిని మంజూరు చేయలేదని ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని సభలో కోరారు. గతంలోనూ ప్రతిపక్ష నాయకుడిగా పోరాడిన మేడిపల్లి సత్యం ప్రసుత్తం అధికారంలో ఉండడంతో భక్తులు అభివృద్ధి కోసం వేచి చూస్తున్నారు.

అద్భుత క్షేత్రంగా తీర్చిదిద్దుతాం



కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానా న్ని రాబోయో కాలంలో అద్భుత క్షేత్రంగా తీర్చిదిద్దుతాం. ప్రత్యేక ప్రణాళికతో పనులు పూర్తి చేయిస్తాం. గత ప్రభుత్వ హయాంలో కొండ గట్టు క్షేత్రం నిర్లక్ష్యాని కి గురైన నేపథ్యంలో యాదాద్రి తరహాలో అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది. భక్తులకు ఇబ్బందులు లేకుండా సకల సౌకర్యాల కల్పన కోసం ముం దుకు వెళ్తాం. **- మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే, చొప్పదండి**


ఏడాది క్రితం అభివృద్ధిపై సమీక్ష చేస్తున్న కేసీఆర్(ఫైల్)

ఎంపీ అర్వింద్‌కు వ్యతిరేకంగా కరపత్రాల పంపిణీ

మెట్‌పల్లి/కోరుట్ల ఫిబ్రవరి 19: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు వ్యతిరేకంగా మెట్‌పల్లి, కోరుట్ల పట్టణంలో వెలిసిన కరపత్రా లు చర్చనీంశంగా మారాయి. దినపత్రికలలో కరపత్రాలను ఇల్లెందుల క్రిష్ణమాచారి, గంగాధర్, శ్రీనివాస్, రమేష్ అనే వ్యక్తుల పేర్లతో సోమవా రం పంపిణీ చేయించారు. 'నిజామాబాద్ ఎంపీగా నియంత ధర్మపురి అర్వింద్ వద్దు, కళ్లకు పెట్టుకున్న కూలింగ్ అద్దాలు తియ్యడు ప్రజలను చూడడు, కారు నుంచి దిగడు ప్రజలతో మాట్లాడడు, ఇంత అహంకారి నియంత ధర్మపురి అర్వింద్ ఎంపీగా వద్దు' అంటూ ప్రచురించారు. కాగా కరపత్రంలో పేర్లు ఉన్న వారిలో ఇద్దరిని విషయంపై వివరణ కోరగా వారు తమకు కరపత్రాల విషయంలో ఎలాంటి సంబదం లేదని గిట్టని వారు ఇలాంటి చర్యలకు పాలుపడి ఉంటారని తెలపడం కొసమెరుపు.


నిజామాబాద్ (MP) గా నియంత ధర్మపురి అర్వింద్ వద్దు
కండ్లకు పెట్టుకున్న కూలింగ్ అద్దాలు తియ్యడు ప్రజలను చూడడు,
కారు నుండి దిగడు ప్రజలతో మాట్లాడడు,
ఇంత అహంకారి నియంత ధర్మపురి అర్వింద్
నిజామాబాద్ MP గా వద్దు.

ఎంపీ అర్వింద్‌కు వ్యతిరేకంగా వెలిసిన కరపత్రం

● అసత్య ప్రచారాలు మానుకోవాలి

మెట్‌పల్లి: రాజకీయ లబ్ధి కోసం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై ప్రతిపక్ష నేతల కుట్రపూరితంగా చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు డాక్టర్ చిట్నేని రఘు హితవు పలికారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ ఆదేశాలు, క్రమశిక్షణకు ప్రతి ఒక్క కార్యకర్త కట్టుబడి ఉండాలన్నారు. క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడితే పార్టీ తగు చర్యలు తీసుకుంటుందన్నారు. ధర్మపురి అర్వింద్ రాజకీయ చతురత వల్లనే గత పార్లమెంట్ ఎన్నికల్లో కాషాయ జెండాను ఎగురవేశారన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఓడించలేక ఎంపీ అర్వింద్‌పై కుట్రలకు పాల్పడుతున్న ప్రతిపక్ష నేతలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు దీటుగా ఎదుర్కో వా లని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోరుట్ల: ఎంపీ అర్వింద్‌పై చేస్తున్న తప్పుడు ఆరోపణలు మానుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సుఖేంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో స్థానిక బీజేపీ నాయకులతో కలిసి సుఖేందర్‌గౌడ్ మాట్లాడారు. అనంతరం కరపత్రం ప్రచురించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై ఎంపీ విమర్శలు..

జగిత్యాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శలు గుప్పించారు. సోమవారం సోషల్‌మీడియాలో ఓ వీడియోను పోస్ట్ చేశాడు. 'నాకు అహంకారమని మీ తమ్ముడు ఏదో కరపత్రాలు పంపిణీ చేయించిండటా... మొన్న ఇట్లనే బీజేపీలో సస్పెండ్ అయిన వారిని పట్టుకొని నా దిష్టిబొమ్మలను తగులబెట్టించి...తగుల బెట్టిన వారిపై పోలీసు కేసులు కాకుండా చూసుకుంటానని చెప్పిండటా' అని మాట్లాడారు. నాకు అహంకారమని ఎందుకు అనిపించిందో చెప్పాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ప్రశ్నించారు. ప్రతీ ఎన్నికల్లో ఇదే చివరి ఎన్నికలు అంటూ పలు ఎన్నికల్లో పోటీ చేస్తున్న జీవన్‌రెడ్డి హుందాగా వ్యవహ రించాలన్నారు. ఎన్నికల్లో బరిలో నిలిచి ఎంతైన కొట్లాడదామని కానీ ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని కుటుంబసభ్యులకు తెలిపాలని హితవు పలికారు.

● బీసీ బిడ్డను ఓడించాలని చూస్తున్నారు..

జగిత్యాల అర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ బిడ్డను ఓడించడానికి కుట్రలు పన్నుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగున్నరు దశాబ్దాలుగా అనేక పదవులు అనుభవించిన జీవన్‌రెడ్డికి రాజకీయ దాహం తీరకపోవడం బాధాకరమన్నారు. ఎంపీ అర్వింద్‌కు టికెట్ రాకుండా చేసేందుకు పార్టీలో సస్పెండ్ అయిన వారిని ఉసిగొల్పి దిష్టిబొమ్మలు తగలెట్టించడం, ధర్నాలు చేయించడం, కరపత్రాలు పంచడం లాంటి చర్యలు మీ కుటుంబ సభ్యుల ద్వారా చేయించడం కుటిల బుద్ధికి నిదర్శనం అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ వచ్చేది లేదని, అంతా మోదీ హవా కొనసాగుతుంటే, ఎంపీగాఈ పోటీ చేసి గెలిచి మీరు చేసేది ఏముందని ప్రశ్నించారు. బీసీ బిడ్డను ఓడించేందుకు కుట్రలు చేయవద్దని జీవన్‌రెడ్డికి శ్రావణి విజ్ఞప్తి చేశారు.

సంక్షిప్త సమాచారం..

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్లలో సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్యులు రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ సర్పంచ్ జవిడి ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

- కథలాపూర్ మండలంలోని సిరికొండ దుర్గమ్మ ఆలయం వద్ద మండల పరిషత్ నిధులు రూ. 1.25 లక్షలతో నిర్మిస్తున్న బోరు, మోటర్ పనులను సోమవారం ఎంపీటీసీ దొప్పల హైమవతి ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ చుక్క దేవరాజం, ఆకుల నర్సయ్య, సింగిల్ విండో డైరెక్టర్ కందారి కిషన్‌రెడ్డి ఉన్నారు.

- ఏటా భూసార పరీక్షలు చేయించుకుంటే పంటలకు శ్రీరామ రక్షగా నిలుస్తుందని జిల్లెలకు చెందిన బాబు జగజ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో రైతులకు భూసారం పెంచే మార్గాలను వివరించారు.

కోరుట్ల: సామాజిక సేవా కార్యక్రమంలో కోరుట్ల నవదుర్గ లయన్స్ క్లబ్ ఉత్తమ సేవా అవార్డును అందుకుంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం జరగిన లయన్స్ క్లబ్ 2022-23 సంవత్సరం చేసిన సామాజిక సేవలలో కోరుట్ల నవదుర్గ మహిళ లయన్స్ క్లబ్ ఉత్తమ సేవ అవార్డులకు ఎంపికైంది. ఉత్తమ అధ్యక్షురాలు, కోరుట్ల మున్సిపల్ వార్డు కౌన్సిలర్ ఆడెపు కమలమధు, ఉత్తమ కోశాధికారిగా వనపర్తి రమ్యచంద్రమోహన్, ఉత్తమ కార్యదర్శిగా కనపర్తి రమశ్రీనివాస్, ఉత్తమ జోనల్ చైర్మన్‌గా చాప వందనకిశోర్ ఎంపికయ్యారు.

- కోరుట్ల పట్టణ శివారులోని ప్రభుత్వం భూమిలో నిర్మాణం చేసుకున్న గుడిసెల వాసులకు ప్రభుత్వం నష్ట పరిహరం అందించాలని అఖిల పక్ష సంఘ నేతలు డిమాండ్ చేశారు. పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో ఏర్పాటచేసిన అఖిలపక్ష సమావేశంలో నాయకులు మాట్లాడారు.

కొడిమ్యాల: మండలంలోని నమిలికొండ గ్రామంలో గోవిందమాంబ సమేత శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, విఘ్నేశ్వర, శివలింగ, నందీశ్వర, నవగ్రహ దేవాలయ నిర్మాణానికి సోమవారం వేద పండితులు గుగ్గిళ్ల పురుషోత్తమాచార్యులు భూమి పూజ చేశారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని వైన్స్‌లు, బార్‌లలో ఎక్సైజ్ అధికారులు సోమవారం సాయంత్రం తనిఖీలు చేశారు. తనిఖీల్లో జిల్లా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల సింగిల్‌విండో డైరెక్టర్ ఆకుల నగేష్ ఆదివారం సాయంత్రం నుంచి ఇంటికి తిరిగిరాలేదని అతని తల్లి ఆకుల గంగవ్వ పోలీసులకు పిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేయగా.. ఈ నెల 24న మల్యాల సింగిల్‌విండో చైర్మన్‌పై అవిశ్వాసం ఉండడం, డైరెక్టర్ నగేష్ కనిపించకపోవడం చర్చనీయంశంగా మారింది.

హిందూ ధర్మ పరిరక్షణకు పోరాటం చేసిన యోధుడు శివాజీ

- ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి

- ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు


రాయికల్‌లో శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ

రాయికల్, ఫిబ్రవరి 19: హిందూ ధర్మ పరిరక్షణకు పోరాటం చేసిన యోధుడు శివాజీ మహారాజ్ అని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద శివాజీ సంఘమిత్ర యూత్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ శివాజీ మహారాజ్ చేసిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో శివాజీ గోనె కాపు సంఘం కోశాధికారి కడపటి మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, సంఘం సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. మండలంలోని మైతాపూర్‌లో దుంపల రాజరెడ్డి స్మారకార్థం శివాజీ విగ్రహాన్ని దుంపల లక్షయ్‌రెడ్డి, లలిత ఆవిష్కరించారు. పట్టణంలోని వివేకవర్ధిని పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శివాజీకి సంబంధించిన పాటలు, గేయాలు పాడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని ముత్యంపేటలో సోమవారం శివాజీ విగ్రహావిష్కరణ జరిగింది. స్థానిక ఛత్రపతి శివాజీ సేనా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విగ్రహాన్ని విగ్రహదాత, గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యుడు మర్రి మహేష్‌రెడ్డి, వాగ్దేవి విద్యాసంస్థల అధినేత పోకల నరేష్‌కుమార్, మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ సామల రేణుక, మాజీ ఉపసర్పంచ్ కొండబత్తిని త్రినాథ్ తదితరులు ఆవిష్కరించారు. అలాగే మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మల్యాల, మద్దుట్ల, నూకపల్లి, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లోనూ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

కథలాపూర్: మండలంలోని సిరికొండ, కథలాపూర్, తాండ్ర్యాల, దుంపేట గ్రామాల్లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు యువకులు ఘనంగా జరిపారు. శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో హిందూ యువసేన సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

ధర్మపురి: పట్టణంలో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా స్థానిక హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ జెండా ఊపి ప్రారంభించారు. రాజకీయాలకు అతీతంగా అధిక సంఖ్యలో హిందూ బాంధవులు హాజరయ్యారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని శివాజీ విగ్రహానికి బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణే ధ్యేయంగా, ధర్మ రక్షణే ధ్యానంగా, హిందుత్వమే ప్రాణంగా స్వాభిమానమే ఆయుధంగా జాతీ పౌరుషాన్ని చాటిన వీరోచిత పోరాటాలు, భీకర యుద్ధాలతో రాజ్యస్థాపన ప్రజల అంతులేని ప్రేమాభిమానాలతో ఛత్రపతిగా శాశ్వత కీర్తిని సాధించారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: వీరుల జ్ఞాపకాలు స్మరించుకోవడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని జోగినిపల్లి గ్రామంలో బీజేపీ కార్యకర్తలతో కలిసి సురభి నవీన్‌రావు జయంతి వేడుకలను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సామ్రాజ్య స్థాపనకు ఛత్రపతి శివాజీ ఎంతో కృషి చేసాడని అన్నారు. కార్యక్రమంలో యూసుఫ్‌నగర్ మాజీ సర్పంచ్ గుగ్గిల్ల తుక్కారాం గౌడ్, నాయకులు పీసరి నర్సయ్య, రమేష్, పంచరి విజయ్ కుమార్ పాల్గొన్నారు.


ముత్యంపేటలో శివాజీ విగ్రహం వద్ద శిలాఫలకం ఆవిష్కరణ


జోగినిపల్లిలో శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు కొత్తధాంరాజుపల్లి, సంగేమ్ శ్రీరాంపూర్, చిట్టాపూర్ తదితర గ్రామాల్లో నాయకులు, యువకులు పార్టీలకతీతంగా శివాజీ జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. శివాజీ కమిటీ సభ్యులు పలువురితో కలిసి శివాజీ జీవిత చరిత్రను వివరించారు.

గొల్లపల్లి: ఛత్రపతి శివాజీ మహారాజు జయంతిని పురస్కరించుకుని గొల్లపల్లి మండలం వెంగళాపూర్‌లో నిర్మించిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. బజరంగ్‌దళ్ వెంగళాపూర్ శాఖ ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజు జయంతిని పురస్కరించుకుని భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో గ్రామంలో శోభయాత్ర నిర్వహించగా, యువకులు గ్రామాల్లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. భజరంగ్‌దళ్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలంలోని తుంగూర్‌లో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అర్చకులు మధు కుమార్‌తో పాటు శివాజీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలో హిందు వాహిణి, హిందు ఏక్తా సమాజ్ మండల శాఖ నాయకులు ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను నిర్వహించారు. హిందూ వాహిని మండల అధ్యక్షుడు కోల సురేందర్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాజీ విగ్రహానికి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పూల మాలలు వేశారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల నాయకులు ఉన్నారు.